## బస్సులో సీటు కోసం కొట్లాట

సోషల్ మీడియాలో వైరల్

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 13: మహాలక్ష్మీ పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించినప్పటి నుంచి సీట్ల కోసం ఘర్షణలు జరుగుతున్నాయి. తాజాగా సిరిసిల్ల జిల్లాలో ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు, మరో వ్యక్తితో గొడవపడ్డారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో కాస్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు గురువారం సిద్దిపేట-సిరిసిల్ల రహదారిలో వేములవాడ నుంచి సిద్దిపేటకు బయలుదేరింది. మార్గం మధ్యలో తంగళ్లపల్లి మండలం నేరెళ్ల శివారులోని బాలికల గురుకుల పాఠశాల మూలమలుపు వద్దకు చేరుకోగానే సీటు కోసం బస్సులో ఉన్న ఓ వ్యక్తి, ముగ్గురు మహిళలతో గొడవపడ్డాడు. సదరు మహిళలను దుర్భాషలాడడంతో ఘర్షణ మొదలైంది. గొడవ ముదరడంతో జుట్టుపట్టి లాగి.. ఒకరినొకరు కొట్టుకున్నారు. దీంతో డ్రైవర్ బస్సును నిలిపివేయగా, కండక్టర్ అతికష్టం మీద గొడవ పడ్డ వ్యక్తిని బస్సులోంచి దింపేశారు. అయినప్పటికీ మహిళలు కిందికి దిగి సదరు వ్యక్తిని కర్రలతో కొట్టారు. పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా, సదరు వ్యక్తి పరారయ్యాడు. ఈ ఘటన సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు.

## ఒకే కాన్పులో ముగ్గురు శిశువులు




ఒకే కాన్పులో పుట్టిన ముగ్గురు శిశువులు

ముస్తాబాద్, ఏప్రిల్ 13: పురిటినొప్పులతో ప్రసవం కోసం దవాఖానకు వెళ్లిన ఓ గర్భిణి ఒకే కాన్పులో ముగ్గురు శిశువులకు జన్మనిచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామానికి పోడెండ్ల సృజన-మహేశ్ దంపతులు. సృజనకు మొదటి కాన్పులో పాప జన్మించింది. తర్వాత మళ్లీ ప్రెగ్నెన్సీ కావడంతో ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ తిరుమల నర్సింగ్ హోంలో వైద్య పరీక్షలు చేయించుకునేది. నెలలు నిండడంతో ప్రసవం కోసం దవాఖానలో చేరింది. సాధారణ కాన్పు సాధ్యంకాకపోవడంతో వైద్యులు శస్త్ర చికిత్స చేయగా, ఆదివారం ముగ్గురు పిల్లలకు జన్మనిచ్చింది. ముగ్గురిలో ఒక బాబు, ఇద్దరు పాపలు కాగా, తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.



అసంపూర్తిగా ఉన్న నారాయణపూర్ కుడి కాలువ

**చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాలకు ఆదరువుగా మారిన నారాయణపూర్ రిజర్వాయర్‌పై కాంగ్రెస్ సర్కారు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నది. ఎల్లంపల్లి బరాజ్‌తో అనుసంధానించిన ఈ ప్రాజెక్టు పరిధిలో 1.50 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలన్నది లక్ష్యంగా కాగా, ఉమ్మడి రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యం చేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం పైప్‌లైన్, ఎడమ కాలువతోపాటు మెజార్టీ పనులన్నీ చేసి 40వేల ఎకరాలకు నీరందించింది. ప్రస్తుతం మళ్లీ గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం రైట్ కెనాల్ పనులు, రిజర్వాయర్ సామర్థ్యం పెంపుతోపాటు సేకరించిన భూమికి పరిహారం చెల్లింపుపై మళ్లీ అదే అలసత్వం చూపిస్తున్నది. కొద్దిరోజుల క్రితం గ్రామానికి వచ్చి జలాశయం పనులన్నీ పూర్తిచేస్తామని, సమస్యలన్నీ పరిష్కరిస్తామని చెప్పిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇచ్చిన హామీ సైతం బుట్టదాఖలు చేయడంపై రైతులు, ప్రజల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.**



నారాయణపూర్ రిజర్వాయర్

# నారాయణపూర్ ప్రాజెక్టుపై నిర్లక్ష్యం?

- రిజర్వాయర్‌పై కాంగ్రెస్ సర్కారు చిన్నచూపు
- నాటి నుంచి నేటి దాకా అదే అలసత్వం
- కుడి కాలువ పూర్తికాక ఎండుతున్న పంటలు
- జలాశయం సామర్థ్యం పెంపు పనులకు గ్రహణం
- భూసేకరణ జరిగినా అందని పరిహారం
- పూర్తయితే 1.50 లక్షల ఎకరాలకు నీళ్లు
- ప్రస్తుతం 40 వేల ఆయకట్టుకే పరిమితం
- నెరవేరని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ
- ఆగ్రహిస్తున్న రైతులు

### ఇసొంటి కరువు ఇంతకుముందు చూడలే

పదిహేనేండ్లలో ఇసొంటి కరువు ఎప్పుడు చూడలే. అంగట్లో అన్ని ఉన్నా అల్లుడి నోట్లె శనన్నట్లున్నది మా రైతుల పరిస్థితి. నారాయణపూర్ రిజర్వాయర్ నిండా నీరున్నా.. రిజర్వాయర్‌కు మా ఊరు కేవలం 5 కిలో మీటర్ల దూరంలోనే ఉన్నా.. మా పంట పొలాలకు సాగు నీరందక ఎండిపోతున్నాయి. పెట్టుబడి సైతం నష్టపోతున్నం. కాలువలు లేక ఊరికి నీళ్లస్త లేవు. ఇట్లయితే పంటలు ఎట్ల పండిచ్చుడు. ఎట్ల బతుకుడు. నారాయణపూర్ కుడి కాలువ పనులు పూర్తి చేస్తేనే మా ఊరి రైతుల కష్టాలు తీరుతాయి. తొందరగా పనులు చేపట్టి మాకు న్యాయం చేయాలని కోరుకుంటున్నం.



**- రామిడి సురేందర్, తాడిజెర్రి**



వెంకంపల్లి వద్ద వట్టిపోయిన బోరు

### పాతాళంలో భూగర్భ జలాలు

సర్కారు నిర్లక్ష్యం, అధికారుల ముందుస్తు ప్రణాళిక లేకపోవడంతో ఏడాది కాలంలోనే భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. 700 ఫీట్లకు బోరేసినా నీళ్లస్తలేవు. నారాయణపూర్ కుడి కాలువ పనులు 98 శాతం పూర్తయ్యాయి. ఇంకో 2 శాతం పూర్తి చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నది. మా తోటి రైతులు నష్టపోతున్నరు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కుడికాలువ పనులు పూర్తి చేయాలే. నారాయణపూర్ చెరువు నీళ్లస్తెనే మా ఊర్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. నీటికి కరువు ఉండదు.



**- ముక్కెర మల్లేశం, వెంకంపల్లి**

కరీంనగర్, ఏప్రిల్ 13 (నమస్తే తెలంగాణ)/గంగాధర : మెట్టప్రాంతమైన చొప్పదండి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసిన నారాయణపూర్ రిజర్వాయర్‌పై ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపుతున్నది. ఉమ్మడి రాష్ట్రంలో చివరిసారిగా అధికారంలో ఉన్న అప్పటి కాంగ్రెస్ సర్కారు హయాంలో చేపట్టిన ఎల్లంపల్లి ప్రాజెక్టుకు అనుసంధానించిన ఈ రిజర్వాయర్ పనులను అర్ధాంతరంగా నిలిపి వేసింది. తిరిగి స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదిక మిగిలిన పనులు పూర్తి చేసి నారాయణపూర్ రిజర్వాయర్ ద్వారా సుమారు 40 వేల ఎకరాలకు సాగు నీరందించింది. వానకాలం, యాసంగి పంటలకు క్రమం తప్పకుండా నీటిని విడుదల చేసి రైతులకు అండగా నిలిచింది. చొప్పదండి, వేములవాడ నియోజకవర్గాల్లోని సుమారు 70 చెరువులు నింపి ఆయకట్టుకు నీరందించేలా ప్రణాళికలు చేసింది. ఏడాదిన్నర కింద అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం రిజర్వాయర్ పనులు చేపట్టంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వస్తున్నాయి. రిజర్వాయర్ సామర్థ్యాన్ని పెంచితే నారాయణపూర్, ఇస్తారిపల్లి, మంగపేట, చర్లపల్లి (ఎన్) ముంపునకు గురవుతున్నాయి. ఈ గ్రామాల్లో భూసేకరణ కూడా పూర్తయ్యింది. ఎల్ఓసీ కూడా వచ్చినట్లు తెలుస్తున్నది. కానీ, ఇంత వరకు క్లియరెన్స్ ఇవ్వకపోవడంతో ముంపు బాధితులకు పరిహారం చెల్లించడంలో ఆలస్యమవుతున్నది.

### నెరవేరని మంత్రి ఉత్తమ్ హామీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన నాలుగు కొత్త పథకాలపై నిర్వహించిన గ్రామ సభలో భాగంగా జనవరి 22న రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గంగాధర మండలం నారాయణపూర్‌కు వచ్చారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనను గ్రామ సభలో నిలదీశారు. తమ గ్రామాలను ముంపు గ్రామాలుగా ప్రకటించాలని మహిళలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆయన నారాయణపూర్ రిజర్వాయర్‌కు ₹70 కోట్లు కేటాయిస్తున్నట్టు ప్రకటించారు. ఇందులో ₹32 కోట్లు భూసేకరణకే ఖర్చు చేయాల్సి ఉంది. అయితే మంత్రి ఇచ్చిన హామీ ఇప్పటి వరకు నెరవేర లేదని ఈ ప్రాంత రైతులు వాపోతున్నారు. భూసేకరణ పనులు పూర్తి చేసి నష్ట పరిహారం చెల్లిస్తే తప్పా తాము గ్రామాలు వదిలేది లేదని ముంపు బాధితులు స్పష్టం చేస్తున్నారు. రిజర్వాయర్‌లో కొంచెం నీటి మట్టం పెరిగితే బ్యాక్ వాటర్ నివాస గృహాల్లోకి చేరుతున్నది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ముఖ్యంగా నారాయణపూర్ ప్రజలకు తీవ్రమైన సమస్యగా మారింది. ఇటీవల రిజర్వాయర్‌ను నింపేందుకు ప్రయత్నించగా నారాయణపూర్‌లోకి బ్యాక్ వాటర్ రావడంతో స్థానికులు కట్టకు గండి కొట్టారు. ఇదిలా ఉండగా, భూ సేకరణ పూర్తయితే తప్పా రిజర్వాయర్ కట్టను బలోపేతం చేసే అవకాశం ఉండదని నీటి పారుదల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

### కుడికాలువ పరిధిలో నీటి కరువు

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నారాయణపూర్ రిజర్వాయర్ కుడి, ఎడమ కాలువల నిర్మాణంపై నిర్లక్ష్యం చేసింది. ఎల్లంపల్లి ప్రాజెక్టులో భాగంగా 2009లో తొలుత రిజర్వాయర్ నుంచి 19 కిలో మీటర్ల దూరం కుడికాలువ నిర్మాణ పనులను ప్రారంభించింది. గంగాధర మండలం మంగపేట, మధురానగర్, వెంకంపల్లి, కాసారం గ్రామాల మీదుగా బోయినపల్లి మండలం స్తంభంపల్లి వరకు ఈ కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. కానీ, అప్పటి పాలకుల నిర్లక్ష్యంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గంగాధర మండలంలోని లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లిలో కొంత భాగం, చెర్లపల్లి, ర్యాలపల్లి వరకు కొడిమ్యాల మండలంలోని బలవంతపూర్, నర్సింహులపల్లి వరకు ఎడమ కాలువ నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం ఈ కాలువ ద్వారా 8 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నారు. ఇక 2014లోనే కుడి కాలువ నిర్మాణ పనులను బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే తిరిగి ప్రారంభించారు. సుమారు 17 కిలో మీటర్ల మేర కాలువ నిర్మాణం పూర్తి చేశారు. మరో 3 కిలో మీటర్ల పెండింగ్‌లో ఉంది. మధురానగర్ చౌరస్తాలో వంతెన నిర్మాణంతోపాటు మరో రెండు కిలో మీటర్లు కాలువ తవ్వకం పనులు పూర్తి చేస్తే నీటి విడుదలకు మార్గం సుగమం అవుతుంది. అలాగే కుడి కాలువకు 12 ఉప కాలువల నిర్మాణం చేయాల్సి ఉండగా, ఒకటి మాత్రమే పనులు ప్రారంభించి, మిగిలిన 11 కాలువలు పెండింగ్‌లో పెట్టారు. కాలువ నిర్మాణం పూర్తి చేసుకుని నీటిని విడుదల చేస్తే మండలంలోని మధురానగర్, వెంకంపల్లి, కురిక్యాల, ఉప్పరమల్యాల, రంగరావుపల్లి, తాడిజెర్రి, కాసారం, గర్శకుర్తి గ్రామాల్లో దాదాపు 10 వేల ఎకరాల్లో సాగు నీటి ఇబ్బంది తీరుతుంది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కూడా నిర్లక్ష్యం చూపుతున్నది. దీంతో కుడి కాలువ పరిధిలోని అనేక గ్రామాల్లో పంటలకు నీరందని పరిస్థితి నెలకొన్నది. ఇప్పటికే పలు గ్రామాల్లో అనేక ఎకరాల్లో పంట ఎండి పోయింది. భూగర్భ జలాలు కూడా పడిపోవడంతో యాసంగి పంటలు ఎండి పోయి రైతులు పశువుల మేతకు వదిలేస్తున్నారు. ప్రస్తుతం నారాయణపూర్ రిజర్వాయర్‌లో నీళ్లున్నా కాలువలు పూర్తికాక పంటలకు నీరందని పరిస్థితి నెలకొన్నది.

### ప్రస్తుతం 40 వేల ఎకరాలకే నీళ్లు

ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నారాయణపూర్ రిజర్వాయర్ గుండె కాయలాంటిది. 2004లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దీనికి పునాది రాయి వేసి మరచిపోయారు. ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2012-13లో ధర్మారం మండలం నందిమేడారం నుంచి నారాయణపూర్ రిజర్వాయర్ వరకు పైప్‌లైన్ పనులు చేపట్టారు. ఈ పనులు కూడా అర్ధంతరంగా నిలిచి పోయాయి. నాణ్యత లోపంతో చేపట్టిన పనులకు తోడు తీవ్రమైన జాప్యం కారణంగా వ్యవస్థ మొత్తం అస్తవ్యస్థంగా మారిన సమయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పనులను యుద్ధ ప్రాతిపదికగా పూర్తి చేసింది. 2016 అక్టోబర్ 15 నుంచి దీనిని వినియోగంలోకి తెచ్చింది. 1.50 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించాలన్నది లక్ష్యంకాగా, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 40 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించింది. ప్రస్తుతం 160 మిలియన్ క్యూబిక్ ఫీట్ల సామర్థ్యంతో ఉన్న ఈ రిజర్వాయర్‌ను 300 నుంచి 320 క్యూబిక్ ఫీట్ల సామర్థ్యానికి పెంచితే అనుకున్న లక్ష్యం నెరవేరే అవకాశం ఉంటుంది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఇప్పటి వరకు అదనంగా ఒక్క ఎకరాన్ని కూడా పెంచింది లేదు. పైగా ఇచ్చిన హామీని మర్చిపోయిందని ఈ ప్రాంత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రిజర్వాయర్ కట్టను వెడల్పు చేయడం, ఎత్తు పెంచడం, మత్తడి ఎత్తు పెంచడం వంటి పనులను అధికారులు ప్రతిపాదించారు. కుడి కాలువ నిర్మాణం పనులు గత బీఆర్ఎస్ హయాంలోనే దాదాపు పూర్తయ్యాయి. మిగిలిన కొద్దిపాటి పనులను పూర్తి చేసేందుకు ప్రస్తుత ప్రభుత్వం చొరవ చూపడం లేదని ఈ ప్రాంత రైతులు వాపోతున్నారు. రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్వయంగా తమ గ్రామానికి వచ్చి ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోలేక పోతున్నాడని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సరిపడా నిధులు కేటాయించి భూసేకరణ పూర్తి చేసి పూర్తి స్థాయిలో పనులు చేపట్టాలని వారు కోరుతున్నారు.



తడిసిన ధాన్యాన్ని నేర్పుతున్న రైతు

## అకాల నష్టం

కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం

మంథని, ఏప్రిల్ 13: ఆరుగాలం కష్టం నీళ్లపాలైంది. ఆదివారం మంథనిలో కురిసిన అకాల వర్షం రైతన్నకు కన్నీరే మిగిల్చింది. మంథని మున్సిపల్ పరిధిలోని ఏఎంసీ, అంగుళూరు, గంగాపురి, ఎగ్లాస్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొంత మేర తడిసింది. కేంద్రాల్లో ధాన్యం పోసి 15 రోజులు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడుతున్నారు. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియక బిక్కుబిక్కుమంటూ గడపాల్సిన దుస్థితి దాపురించిందని వాపోతున్నారు.



ధాన్యం కుప్పల్లోని వర్షపు నీటిని తొలగిస్తున్న రైతులు



అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే రవిశంకర్, దళిత సంఘ నాయకులు

## అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్
- ఒగులాపూర్‌లో అంబేద్కర్ విగ్రహావిష్కరణ

మల్యాల, ఏప్రిల్ 13: రాజ్యాంగంలో అంబేద్కర్ రూపొందించిన ఆర్టికల్ 3 ప్రకారమే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పేర్కొన్నారు. అంబేద్కర్ గొప్ప మేధావి అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఆదివారం ఒగులాపూర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని స్థానిక నాయకులు, దళిత సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించి, మాట్లాడారు. స్వరాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వహయాంలో 11.7 ఎకరాల్లో ₹146 కోట్లతో అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయించిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. ఇక్కడ బీఆర్ఎస్ నాయకులు అయిల్నేని సాగర్‌రావు, బోయినిపల్లి మధుసూదన్‌రావు, జనగం శ్రీనివాస్, పొన్నం సరోజన, మల్లేశం గౌడ్, సుభాన్, అల్లూరి అనిల్‌రెడ్డి, పందిరి శేఖర్, అమీర్,భూసి గంగాధర్, క్యాతం భూపతిరెడ్డి, మిట్టపల్లి ధశరథం, కొంక నర్సయ్య, అంబేద్కర్ సంఘ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## వామ్మో ఎండ



భానుడు భగ్గుమంటున్నాడు. ఉదయం 9 గంటల నుంచే ప్రతాపం చూపుతున్నడు. 11గంటల నుంచే మాడు పగుల కొడుతున్నడు. మధ్యాహ్నం కల్లా నిప్పుల కొలిమిలా మారుతుండగా, రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారతున్నాయి. సాయంత్రం దాకా భగ్గుమంటుండగా.. సోమవారం జగిత్యాలలో గరిష్ఠంగా 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో ప్రజలు పొద్దంతా ఇండ్ల నుంచి బయటికి రాలేని పరిస్థితులు నెలకొన్నాయి.

**- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కరీంనగర్**

### మమ్ముల రోడ్డున పడేసిన్రు

మాకు ఇల్లు వచ్చిందని మంజూరు పత్రం ఇచ్చిన్రు. మళ్లోసారి గ్రామసభ పెట్టి కచ్చితంగా ఇల్లు నిర్మించుకోవాలని చెప్పిన్రు. నిజమేనని నమ్మి ఉన్న ఇల్లును ఇప్పేసుకున్న. తీరా అధికారులు వచ్చి ఆన్‌లైన్‌లో పేరు లేదని అన్నరు. మమ్ముల రోడ్డున పడేసిన్రు. నేను, నా భార్య ఉపాధి హామీ పథకంలో నిర్మించిన పశువుల పాక (ఎడ్లకొట్టం)లో ఉంటున్నం. నా కొడుకు, పిల్లలు ఇంకో చోట ఉంటున్నరు. ముందే ఆన్‌లైన్‌లో చూసి చెబితే ఇల్లు విప్పకపోదు. నా కుటుంబం రోడ్డు మీద పడేది కాదు. కొడుకు, కోడలు, మనుమడు, మనుమరాలితో కలిసున్న కుటుంబాన్ని విడగొట్టుకున్నట్లయింది. దాదాపు రెండు నెలలుగా ఇల్లు కోసం ఆఫీసుల చుట్టు తిరుగుతున్నా అధికారులు పట్టించుకుంట లేరు. నాకు న్యాయం చేయాలి.

**- ఆకునూరి దేవయ్య రామ్‌సాగర్**



ప్రజాపాలన గ్రామ సభలో అధికారులు అందించిన ఇంటి మంజూరు పత్రాన్ని చూపుతున్న ఆకునూరి దేవయ్య

# గూడు చెదిరింది.. కొట్టమే దిక్కయింది!

పైలెట్ గ్రామం రామ్‌సాగర్‌లో గూడు గోడు

- గ్రామసభలో ఇల్లు వచ్చిందని దేవయ్యకు మంజూరు పత్రం
- పనులు మొదలు పెట్టాలని చెబితే పాత ఇల్లు కూల్చివేత
- కట్టుకునే సమయానికి ఆన్‌లైన్‌లో పేరు లేదని అధికారుల ట్విస్ట్
- రోడ్డున పడ్డ కుటుంబం
- ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

**లెక్కలేనన్ని హామీలు, ఆరు గ్యారెంటీలతో అరచేతిలో వైకుంఠం చూపిన కాంగ్రెస్ సర్కారు, అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలను మోసం చేస్తున్నది. గూడు లేని ప్రజలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ఇల్లు కట్టుకునేందుకు ₹5లక్షలు ఇస్తామని చెప్పి ఊరించి ఉసూరుమనిపిస్తున్నది. అందుకు కొడిమ్యాల మండలం రామ్‌సాగర్ గ్రామంలో ఆకునూరి దేవయ్య దుస్థితే నిదర్శనంగా నిలుస్తున్నది. ఇల్లు మంజూరు అయిందన్న సంబురంలో పాత ఇంటిని కూల్చేయగా.. అసలు ఆన్‌లైన్‌లో పేరురాలేదని అధికారులు చెప్పడంతో కొట్టమే దిక్కయింది.**

కొడిమ్యాల, ఏప్రిల్ 13 : ఆరు గ్యారెంటీల అమలుకు ప్రజాపాలన పేరిట జనవరి నెలలో ప్రభుత్వం ఊరూరా గ్రామ సభలు నిర్వహించింది. వందశాతం పథకాల అమలు కోసం మండలానికో పైలెట్ గ్రామాన్ని ఎంపిక చేసింది. ఆ మేరకు రామ్‌సాగర్‌ను అధికారులు సెలెక్ట్ చేశారు. జనవరి 26న రిపబ్లిక్ డేను పురస్కరించుకొని గ్రామంలో 41 మందిని ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులుగా గుర్తించి, మంజూరు పత్రాలు అందించారు. ఫిబ్రవరి 14న మరోసారి గ్రామ సభ నిర్వహించి, లబ్ధిదారులందరూ కచ్చితంగా ఇందిరమ్మ ఇండ్ల పనులు మొదలు పెట్టుకోవాలని సూచించారు. దాంతో ఇల్లు మంజూరైన ఆకునూరి దేవయ్య ఇంటి నిర్మాణానికి సిద్ధమయ్యాడు. తన భార్య బుచ్చవ్వ, కొడుకు రాజు, కోడలు గంగాజల, మనుమరాలు వియాన్సి, మనుమడు లలిత్‌రామ్‌తో కలిసి ఉంటున్న పాత ఇల్లును ఫిబ్రవరి 16న (డిస్మెటల్) కూల్చివేశాడు. కొత్త ఇల్లు పూర్తయ్యేదాకా గ్రామంలోనే కిరాయికి ఉండాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో కొడుకు కుటుంబం ఒకచోట, దేవయ్య తన భార్యతో కలిసి ఉపాధి హామీ పథకంలో నిర్మించుకున్న ఎడ్ల కొట్టంలో ఉంటున్నాడు. అయితే ఫిబ్రవరి 18న ఇంటి పనులు ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. అప్పుడు పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్ వచ్చి మీకు ఇల్లు మంజూరు కాలేదని, ఆన్‌లైన్‌లో పేరు కనపడడం లేదని, పేరు వచ్చిన అనంతరం ఇల్లు పనులు మొదలు పెట్టుకోవాలని సూచించడంతో దేవయ్య, ఆయన రాజు కంగుతిన్నారు. ఇల్లు ఇప్పినంక ఇదేం మోసమని వాపోయారు. అప్పటి నుంచి కలెక్టరేట్, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ, అధికారులకు వినతి పత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవయ్యే కాదు.. అదే గ్రామానికి చెందిన ఉరుమడ్ల లక్ష్మి, ద్యాగల రాజమణి పేర్లు కూడా ఆన్‌లైన్‌లో రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.

### కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా

ఆకునూరి దేవయ్యకు ఇందిరమ్మ ఇల్లు టెక్నికల్ ఇష్యూతో మంజూరు కాలేదు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లా రెండు మూడు రోజులలో మంజూరు వస్తది. దేవయ్యకు గ్రామంలో మరో ఇల్లు రేకుల షెడ్డు కూడా ఉన్నది.

**- స్వరూప, ఎంపీడీవో (కొడిమ్యాల)**

